రేడియో రగడ

రచన : "శ్రీ భగవత్కుమార"

—o—

"ఏమండీ పండుగకు ఎప్పుడు వెడదాం ?" నిర్మల అన్నం వడ్డిస్తూ అంది.

"నీ యిష్టం రేపు నిన్ను పంపిస్తాను నీవు వెళ్లు" అన్నాడు రామం.

"నన్ను పంపించట మేమిటండీ. మనిద్దరం శ్రేప్రొద్దుటే వెడదామంటేనూ. పోయిన దసరాకుకూడా రాలేదని నాన్న ఎంతో బాధపడ్డాడు. ఆయన బాధ మీకేం తెలుస్తుంది ? నామాట వినండీ రేపు మనిద్దరం వెడదాం. సరేనా !" అంది.

"అంత పండుక్కు రావాలనుకున్న వాడు ఆ రేడియోనే కొనిపెట్టకూడదూ! పెళ్లిలో యిస్తానన్నాడు. ఇంతవరకూ గతిలేదు" వున్న అక్కసు అంతా వెళ్లగ్రక్కేడు.

రేడియో విషయం భర్త బయట పెడతాడని ఎప్పుడో అనుకుంది, నిర్మల అనుకున్నట్లుగానే జరిగింది.

"నాన్న పరిస్థితి మీకు తెలియంది ఏముంది చెప్పండి. లేమిడి సంసారం. పెళ్లిలో ఆ నాలుగు వేల కట్నం యివ్వటానికే వున్న పొలం కాస్తా తాకట్టు పెట్టవలసి వచ్చింది. ఇప్పటికిప్పుడు రేడియో కావాలంటూ మొండిపట్టుతో కూర్చుంటే ఎలా చెప్పండి? ఇదేమయినా పాతరా ! త్రవ్వి పట్రావటానికి. వసతి చూసుకొని తప్పకండా కొనిపెడతానన్నాడుగా, నామాట వినండి. మనిద్దరం వెడితే వాళ్లకు కడుపు నిండినట్లుగా వుంటుంది —" అంది నిర్మల.

"నాయిష్టం నాదీ. నిన్నెవడూ వాళ్ల తరఫున వకాల్తా పుచ్చుకుని చెప్పమనియాడవలేదు-" అన్నాడు.

"మీ రెంత మూర్ఖులండీ! చదువుకున్నారు బి. ఏ. ఎందుకూ! ఎదుటివారి హృదయాన్ని అర్థం చేసుకోలేరు." అంది.

"నిర్మలా !"

"లేకపోతే ఏమిటండీ యీ మొండిపట్టు" అంది.

రామం నిర్మల చెంప చెళ్లు మనిపించాడు. నిర్మల ఏడుస్తూ కూర్చుంది. రామం చీకాగ్గా గొణుక్కుంటూ బయట కెళ్లిపోయాడు.

ఆ రాత్రి నిర్మలకు సరిగా నిద్ర పట్టలేదు. మనసంతా పుట్టింటమీదవుంది. రామం చూస్తే యిలా మొండిగా ప్రవర్తిస్తున్నాడు ఎలాగైనా పుట్టింటికి వెళ్ళాలనుకుంది. ఎంతయినా స్త్రీకి కన్న యింటి మీద వుండే వాత్సల్యం అటువంటిది. భర్త రాకపోతే తన తల్లితండ్రీ బాధ చెందుతారు. రేడియో కొనందే ఆ పట్టు వదలడు ? "చెడిపోయిన

వాళ్ళేదో చెడిపోయారు. ఈ ఒక్క రేడియోతో ఇంక ఎక్కువగా చెడిపోయేది ఏముంది? ఎలాగో నాన్న కాళ్ళావేళ్ళాపడి అ రేడియో కొనిపిస్తాను. అప్పుడు కొనక ఏంచేస్తాడు? రేడియోను గురించి రగడ పెరగటం నాన్నకు మాత్రం ఇష్టమా? ఈ ఆలోచన స్ఫురించేసరికి హాయిగా నిద్రపోయింది నిర్మల.''

తెల్లవారింది. నిర్మల నవ్వుతూ పని చేసుకుంటుంది. ''రామం నిర్మల నవ్వు మొహాన్నిచూసి వింతపోయాడు. రాత్రి తన్నులు తింది. ఇవ్వాళ యీ నవ్వు మొహం! ఆడవారు నవ్వుకు విపరీతార్థమేదో వుండివుంటుంది'' అని అనుకుంటూ నిర్మల దగ్గరకొచ్చాడు.

''ఏమండీ! యివ్వాళ తప్పకండా వెళ్లి తీరాలి'' అంది.

''నేను రాను!''

''రాకపోతే కుదరదు! మీకు రేడియో ఇప్పించే బాధ్యత నాది'' అంది.

రామం ఆశ్చర్యపోయాడు. ''సరే నాకు రేడియో ఇప్పించక పోవాలి — వుంటుంది రగడ! నీమాట నీవు దక్కించకపోతే నలుగురిలోనూ మీ నాన్నను రచ్చపాలు జేయనూ! పద. ఏ మాత్రం మాట నిలబెట్టుకుంటావో చూస్తాను.'' అంటూ బండికోసం బజారుకు బయలు దేరాడు. నిర్మల నిరుత్తరురాలయింది.

అల్లుడూ కూతురూ రావటంతో వాళ్ళ మనసు ఆనంద పులకితమైంది. రామాన్ని మామగారు పలకరించి లోపలకు తీసుకెళ్లారు.

నిర్మల తండ్రితో రేడియో విషయం చెప్దామని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తునే వుంది. కళ్లారా తండ్రి కష్టాలనుచూస్తూ అడగటానికి మనసొప్పిందికాదు. అడుగకపోతే భర్త రగడ చేయక మానడు. అడగటానికి మనసొప్పటంలేదు. ఏం చేయటమో తోచలేదు.

ఆ వుదయం రామం బద్ధకంగాలేచి మొహం పుల్ల తీసుకొని బయటకు వెళ్లాడు. మామగారూ మరొక మనిషీ ఘర్షణ పడటం కళ్ళారా చూశాడు. ఆ రెండవ మనిషి వెంకయ్యగారని నిముషంలో పోల్చుకున్నాడు.

''నా మాట వినండి వెంకయ్యగారూ! వచ్చే యేడు మీ బాకీ మొత్తం చెల్లు వేస్తాను. ఈయేటికి మాత్రం వూరుకోండి.'' అంటున్నాడు మామగారు.

''ఆ వ్యవహారమంతా నాకు కుదరదయ్యా. ముందు బాకీ చెల్లు వేయాల్సిందే కూతురు పెళ్ళికని నాలుగువేలు బాకీ తీసుకున్నావ్. మూడేళ్ళు కావస్తున్నా చెల్లు వెయ్యకపోతే ఎల్లా.'' అన్నాడు వెంకయ్య. వెంకయ్యను బ్రతిమాలి బయటకు పంపే

సరికి ఆయన తలప్రాణం తోకకొచ్చినంత పనయింది. ఇంతలో బంగారపుకొట్ల బ్రహ్మయ్య వచ్చి మామగారిని నిలవేశాడు.

"వచ్చేయేడు పంటంతా మీదే బ్రహ్మయ్యగారూ! మా గతి ఏదో మేం పడతాం. వచ్చే యేడు కళ్ళంలో గింజ లమ్మి మీ బాకీ తీరుస్తాగా–మన్నించండి షావుకారుగారూ!" వేడుకుంటాడు మామగారు.

"ఏమిటయ్యా నీ కూతురు పెళ్ళికి పెట్టిన నగల ఖాతా యింతవరకూ పైసా చెల్లించలేదు' లాభంలేదు. నా బాకీ తీరుస్తే తీర్చు; లేకపోతే నీ యిల్లు వాకిలీ వేలం వేస్తా" నంటూ కూర్చున్నాడు.

ఇంతలో బట్టలకొట్టు భూషయ్యగారు వచ్చి "ఏందయ్యోయ్! వచ్చే యేడాది పంటంతా ఆయనకే కట్టపెడతానంటున్నావ్. మరి పెళ్ళికని తీసుకున్న బట్టల బాకీని ఏం జేస్తావ్?" నిలదీసి అడిగాడు. "షావుకారుగారూ! నా మాట వినండి. మీకు ముందుకు చెల్లిస్తాను. ఇప్పుడు నా దగ్గర చిల్లిగవ్వకూడా లేదు. బ్రతిమాలుకుంటున్నాను షావుకారుగారూ! అవతల అల్లుడుకూడా వున్నాడు. నన్నల్లరి పెట్టకండి" అని వారిద్దర్నీ సాగనంపేసరికి పెంట్రుకలు నరిసినంత పనయింది.

రామం నిలువునా నీరయిపోయాడు. మామగారి పరిస్థితిని కళ్ళారా చూసేసరికి అతని మనసు మారిపోయింది. అనవసరంగా రేడియోనుగురించి ఆయన మనసును ఇంకా బాధపెట్టటం భావ్యం కాదనే భావం వుదయించింది. మామగారు దిగులుపడి లోపలకు వస్తూ "అవతల అప్పుల బాధలు అల్లా వున్నాయి; ఇవతల అల్లుడు రేడియో కావాలంటూ కూర్చున్నాడు. నా బ్రతుకు ఇంకా ఎంత నవ్వుల పాలు కావలసి వుందో." అని గొణుక్కుంటూ లోపలకు పోయాడు. ఆ మాటలు వినగానే రామంగుండెలు నిలువునా నీరయిపోయింది. "ఛీ! ఎంత మూర్ఖంగా ప్రవర్తించాను. అనవసరంగా నిర్మలనూ, మామగారి మనస్సునూ నొప్పించాను" అని బాధపడ్డాడు. ఆ రాత్రి నిర్మల భర్త గదిలోకి వచ్చింది. భర్త ఏదో ఒక విధంగా వున్నాడు. "ఇవ్వాళ నాన్నతో చెప్పాను. ఆ వున్న నాలుగు బస్తాలవడ్లు అమ్మి రేడియో తీసుకొస్తానన్నారు. సరేనా?" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో అంది నిర్మల.

రామం కళ్లవెంట అశ్రువులు రాలినయ్. "నన్ను క్షమించు నిర్మలా. మూర్ఖంగా ప్రవర్తించి నీ మనస్సునూ, ఆయన్నీ కష్టపెట్టాను. ఇవ్వాళ ఉదయం మామగారి

52–వ పేజి చూడుడు

పిచ్చి రాధ

"ప్రమద"

"అతను సందుమలుపు తిరుగుతున్నాడు. అవును! ప్రతిసారి తిరుగుతాడు. అతనెవరు? అతన్ని చూస్తే నాకెందుకింత ప్రేమ?" అనుకుంది రాధ. రాధ వకీలు కామేశ్వర రావుగారి కూతురు. ఇంటర్మీడియట్ పాసయింది. ఇక చదువుదామనుకున్నా తల్లి కిష్టములేక పోవటమువలన ఆగింది చదువు.

ఇన్నాళ్లు రాధ మామయ్య దగ్గిర ఉండి చదివింది. ఆయనకు పిల్లలు లేరు. రాధ అంటే ప్రేమ. అందుకని స్కూలు ఫైనలు పేసవగానేవచ్చి తీసికెళ్ళాడు.

రాధవచ్చి షుమారు పదిహేను రోజులయింది. ఈ పదిహేను రోజుల్లో ప్రతిరోజూ అతన్ని చూస్తుంది. అతనెవరో తెలియదు? కాని రాధకి అతను ఆత్మీయుడుగా కనపడ్డాడు.

తనకి తెలియకుండానే ప్రేమించింది. అతను కనీసము తనవేపైనచూడడు. ప్రతిరోజూ ఆశగా అతనివంక చూస్తుంది. అతనొక్కడే తలవంచుకొని పోతాడు. అతనిపక్కన సాధారణంగా స్నేహితులుండరు.

ఓ రోజు ధైర్యముచేసి అడిగింది రాధ "ఏమండీ! మీ దగ్గర ఏమన్నా పుస్తకాలుంటే ఇస్తారా? మళ్ళీ సాయంత్రము ఇచ్చేస్తాను. ఏం తోచటంలేదు."

"దానికేం" అంటూ ఓ పది పత్రికలేవో తెచ్చాడు వాటిలో కనీసము ఒకటీ చదవలేదు! సాయంత్రము ఇచ్చేస్తూ, "థాంక్స్. మీ పేరు?" అంది. "కృష్ణమూర్తి" అన్నాడు అతడు. "వస్తానండి" చెప్పివెళ్ళిపోయాడు.

"అబ్బ! ఇంకొంచెముసేపుంటే బాగుణ్ణు." అనుకుంది రాధ.

ఆ మర్నాడు అతను మరో అందమైన అమ్మాయితో వెళుతున్నాడు. రాధ చాలబాధపడింది. "ఆ అమ్మాయి ఎవరో? అతను, ఆ అమ్మాయి ఉత్సాహంగా నవ్వుకుంటూ పోతున్నారు. వాళ్ళిద్దరూ భార్యభర్తలే!" అనుకుంది.

గబ గబ రూములోకివచ్చింది. డ్రాయరు ముందర కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నది. "తనది భగ్నప్రేమ. తను అంతగా అతన్ని ప్రేమిస్తుంటే అతను మరొక యువతితో! సహించలేను." అనుకుంది రాధ.

"ఓ రాధమ్మ, కృష్ణుణ్ణి తరువాత తలచుకుందువు గాని ఇటుచూడు" అన్న తండ్రి పిలుపు విని ఉలిక్కిపడింది. కళ్ళు తెరిచి చూసింది.

"అన్నయ్య అరే! ఎప్పుడొచ్చేశావు?" అంది

"ఇప్పుడే! వాడొచ్చిందికూడ తెలిదన్నమాట" తండ్రిమాటవిని జవాబు చెప్పలేక ఊరుకుంది.

(51-వ పేజి తరువాయి)

పరిస్థితిని చూసేసరికి నామనసు మారిపోయింది. నాకు రేడియో అక్కరలేదు. నన్ను క్షమించమని మామగారిని వేడుకొంటాను. ఇప్పుడు ఎదుటవారి కష్టమంటే ఏమిటో అర్థమయింది నిర్మలా!" అన్నాడు రామం గాద్గదికంగా. రామంలో కల్గిన యీ మార్పును చూసి నిర్మల ఆశ్చర్యపోయింది. "ఇదంతా నా అదృష్టం!" అంది ఆనంద భాష్పాలు రాలుస్తూ.